చేనేతకు చేయూతనిచ్చింది జగనన్నే

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



మాచాని సోమప్ప విగ్రహం వద్ద చేనేతలు, నాయకులతో బుట్టారేణుక



మాచాని సోమప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: చేనేతల అభ్యున్నతికోసం మగ్గం ఉన్న ప్రతి నేత కార్మికుడి కుటుంబానికి ఏటా నేతన్న నేస్తం కింద రూ.24వేలు ఇచ్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో బుధవారం జాతీయ చేనేతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పలువురు కౌన్సిలర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పద్మశ్రీ మాచాని సోమప్ప చిత్రపటానికి, సోమప్ప సర్కిల్‌లోని విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో నేత కార్మికులను ఉద్దేశించి బుట్టా రేణుక మాట్లాడుతూ.. చేనేత వృత్తికి ఆదరణ, చేయూత కరువై చితికిన కార్మికులకు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్న నేస్తం, చేనేతల పింఛన్ లాంటి పథకాలు ప్రవేశపెట్టి చేయూతనిచ్చారన్నారు. ఫలితంగా చేనేత కుటుంబాలకు కొంత వరకు ఆర్థిక ఇబ్బందులు తొలగి తమ వృత్తిని కొనసాగించుకొంటున్నారన్నారు. అదేవిధంగా దివంగత నేత వైఎస్సార్ 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చారని గుర్తు చేశారు.

సోమప్ప వల్లే ఎమ్మిగనూరుకు గుర్తింపు

చేనేత పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్పతోనే చేనేతలకు గుర్తింపు వచ్చిందని, దీంతో దేశంలోనే ఎమ్మిగనూరు చేనేత పురిగా పేరుగాంచిందని బుట్టా రేణుక అన్నారు. ఆయన అడుగు జాడలోనడిచి చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని, ఇందుకు కొత్త ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. మున్ముందు తాను చేనేతల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో ఇంకా పదవుల్లో వున్న కౌన్సిలర్లు నిర్భయంగా ప్రజా సేవకు అంకితం కావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా ప్రతుల్, శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, వైడబ్ల్యూసీఎస్ మాజీ చైర్మన్ బండానాగరాజు, మాజీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ బీఎస్ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు నీలకంఠ, ఎంకే. శివప్రసాద్, నాగేషప్ప, విశ్వనాథ్ రమేష్, అంపమ్మ, బజారి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి యూకే వీరేంద్ర, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



ఆసుపత్రిలో పెద్దయ్యను పరామర్శిస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరు టౌన్/రూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి కర్నూలులోని విశ్వభారతి అస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్ల పెద్దయ్యను బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పరామర్శించారు. దాడికి గల కారణాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టాప్రతుల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నందవరం తహసీల్దార్‌గా శ్రీనివాసులు



సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నందవరం తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : మండల నూతన తహసీల్దార్‌గా కె.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. గతంలో విజయవాడ సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానిక కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌ఐ జర్మియా, వీఆర్వోలు ఆయనకు సన్మానం చేశారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన నందవరం తహసీల్దార్

ఆదోని రూరల్: నందవరం మండల నూతన తహసీల్దార్ కె.శ్రీనివాసులు బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్‌కలెక్టర్‌కు శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గోనెగండ్ల సీఐగా ఎ.గంగాధర్



సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎ. గంగాధర్

గోనెగండ్ల : గోనెగండ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.గంగాధర్ బుధవారం ఉదయం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఎ.రామకృష్ణయ్య కర్నూలు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న ఎ. గంగాధర్‌ను బదిలీపై నియమించగా బాధ్యతలు స్వీకరించారు.సీఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైన శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూస్తామని తెలిపారు.

సమాజహితం కోసం పాటుపడదాం



సీఐకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఆదోని రూరల్: సమాజహితం కోసం పాటుపడదామని ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సీఐని కలిసి శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లాధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ, ఆదోని నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బెస్త జయసూర్య, బల్లేకల్లు సూర్య, మహేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం



చేనేత కార్మికురాలిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని అర్బన్: పట్టణంలో బీజేపీ పట్టణ కోశాధికారి చిల్లాల దత్త ఆధ్వర్యంలో చేనేత కార్మికులను బుధవారం సన్మానించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిందే సాయికుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించామన్నారు.ఈ సందర్భంగా చేనేతలకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డే శేఖర్, శ్రీనివాసులు, లక్ష్మణ్, రోష కృష్ణ,కృష్ణారావు పాల్గొన్నారు.

సెబ్ స్టేషన్ తనిఖీ



సెబ్ స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక సెబ్ స్టేషన్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అనంతపురం రేంజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమ మద్యం తరలింపులో పట్టుబడిన వాహనాల్లో ఎన్నింటికి వేలాలు నిర్వహించారు అనే విషయాలను సెబ్ సీఐ భార్గవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను బుధవారం అనంతపురం (నోడల్) సెబ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయశేఖర ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని కేసులు, ప్రాపర్టీ, పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. పలు సూచనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేయాలని సూచించారు. అక్రమ మద్యం సరఫరా, నాటుసారా కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. సెబ్ సీఐ విన్నీలత, సెబ్ ఎస్ఐలు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేస్తాం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ఆదోని జాతీయ రహదారి కోసం భూములు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేస్తామని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నేషనల్ హైవే కోసం భూములిచ్చిన వారితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి కోసం 830 మంది నుంచి 23.6369 హెక్టార్ల భూమిని సేకరించడం జరిగిందన్నారు. భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం పరిహారం అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోనిలో జాతీయ రహదారి కోసం భూములు ఇచ్చి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని త్వరగా వచ్చేటట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్‌రెడ్డి, ఆదోని తహసీల్దార్ ఆర్.శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు



ఆదోని సంతపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూలు

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలను గురువారం నిర్వహించనున్నారు. పాఠశాలల్లో ప్రభుత్వ నిధుల వినియోగంపై తల్లిదండ్రుల భాగస్వామ్యం కోసం ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిస్తోందని ఎంఈఓ శోభారాణి బుధవారం తెలిపారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 59 పాఠశాలలకు గాను 14792మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. మండలంలో 59పాఠశాలలకు గాను 40పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలు, 15 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠశాల, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. కా గా, నూతన ప్రభుత్వం ఏర్పడడంతో ప్రతి పాఠశాలలో చైర్మన్ల పోస్టులన్నీ తమ పార్టీ నేతలకే కావాలన్న ఉద్దేశంతో టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో పోలీసు బందోబస్తు

ఆదోని సెంట్రల్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 130 పాఠశాలల్లో గురువారం ఎన్నికలు జరగుతాయని చెప్పారు. మధ్యాహ్న భోజనం నిర్వహణలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని గణేకల్లు, హానవాళ్లు, మండిగిరి, సలకకొండ వంటి 15 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు.

ఏర్పాట్లు పూర్తి

నందవరం : మండలంలోని 43 ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి(ఎస్ఎంసీ) ఎన్నికలు విద్యాధికారులు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల సంబందించి అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ రామాంజనేయులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని విద్యాధికారులు చెబుతున్నారు. ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని ఆయా పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని, ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని ఎంఈఓ రామాంజనేయులు తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి ఏపీ ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో 10వ తరగతి విద్యార్థి పార్వతి మృతిపై విచారణ చేపట్టాలని బుధవారం ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో విద్యార్థులు మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో గంటకుపైగా 167 జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శి థామస్ మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపించి మరణానికి కారణాలు బయట పెట్టాలని కోరారు. హత్య కోణంలో దర్యాప్తు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో హైస్కూలు విద్యార్థులతో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్, దివాకర్, మైఖేల్, రఘు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం



పిల్లలకు అన్నప్రాశన చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కోసిగి: పుట్టిన వెంటనే బిడ్డకు అరగంట లోపు ముర్రు పాలు పట్టించడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్స్ విజయ కుమారి, కాత్యాయిని, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక బాలకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు గర్భందాల్చిన నాటి నుంచి ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులను అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు హెప్సిబారాణి, వరలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట, చెన్నాపురం, బోడబండ, నక్కలమిట్ట గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. దేవబెట్ట గ్రామంలో వారోత్సవాల్లో సూపర్‌వైజర్ ప్రీతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు సుమిత్రదేవి, ఇందిరా, నరసమ్మ, పద్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లు మంజూరు



వివరాలు వెల్లడిస్తున్న ఎంఈ చలపతిరావు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నామని మున్సిపల్ ఎంఈ చలపతిరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఆరు ప్రాంతాల్లో 10 సీట్లు చొప్పున ఆరు మరుగుదొడ్లను నిర్మించనున్నామన్నారు. అమరావతినగర్, అరుంజ్యోతినగర్, వాల్మీకినగర్, రాయనగర్, టీజీఎల్ కాలనీలోని బీసీ హాస్టల్ సమీపంలో లెట్రిన్‌లను నిర్మించనున్నామని చెప్పారు. ఇందులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్కీం కింద రూ.90 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

ఆదోని తాలూకా సీఐగా నల్లప్ప



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న నల్లప్ప

ఆదోని రూరల్: ఆదోని తాలూకా సీఐగా నల్లప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పాణ్యం రూరల్ సర్కిల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చానన్నారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. మట్కా, నాటుసారా, అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. తాలూకా పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తాలూకా పరిధిలో ప్రజల శాంతభద్రలకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి కర్నూలు వీఆర్‌కు వెళ్లారు.

ఆర్డీటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఇళ్లను ప్రారంభిస్తున్న రీజనల్ డైరెక్టర్ వై.సరస్వతి

ఆదోని రూరల్: ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ అందించే సేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ వై.సరస్వతి సూచించారు. బుధవారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన 18 ఇళ్లను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు విన్సెంట్ ఫెర్రర్ పేదల కోసమే ఈ సంస్థను స్థాపించారన్నారు. ఇప్పటివరకు ఇళ్లు లేని ఎందరో నిరుపేదలకు ఇళ్లను నిర్మించడం ఇవ్వడం జరిగిందన్నారు. చదువులో ముందుండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద విద్యార్థులను ఆదుకుని స్కాలర్‌షిప్‌లను కూడా అందించిపై చదువులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ హనుమంతప్ప, ఎంఅండ్ఇఎస్‌టీఎల్ జయసింహా, గ్రామ సీఓ గంగాధర ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బీజేపీ విధానాలు



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు పంపన్న గౌడ్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు ప్రమాదకరంగా మారాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, రంగన్న ఆరోపించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల సీపీఐ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేకూర్చేలా నిర్ణయం తీసుకుంటోందన్నారు. కేంద్ర బడ్జెట్లో కార్మికులు, కర్షకులకు, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చేలా ఏ ఒక్క అంశం లేదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు బీటీ చిన్నన్న, మద్దిలేటి నాయుడు, తిమ్మగురుడు, విరూపాక్షినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి మీదుగా ప్రత్యేక రైలు



కోసిగి స్టేషన్‌లో ప్రత్యేక రైలు

కోసిగి: కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు నుంచి రాయచూర్ వరకు ప్రత్యేక రైలును ప్రారంభించినట్లు కోసిగి రైల్వే స్టేషన్ మాస్టర్ కౌశల్‌కుమార్ తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ వరకు రైలు నడుస్తుందన్నారు. ప్రతి రోజు ఉదయం గుంతకల్లు జంక్షన్ నుంచి 5.49 గంటలకు బయలు దేరి కోసిగికి 7.21 గంటలకు, రాయచూర్‌కు 8.22 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి అదే రోజున రాయచూర్‌లో మధ్యాహ్నం 15.45 గంటలకు బయలుదేరి కోసిగికి 16.22గంటలకు, 17.30 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుందన్నారు.

బి.పి.మండల్ సిఫారసులను అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదోని టౌన్: కేంద్ర ప్రభుత్వం బి.పి.మండల్ కమిషన్ సిఫారస్సులను అమలు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు సాయిబాబా, తాలూకా ఆర్గనైజేషన్ సెక్రటరీ అండ్ ప్రచార కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో బుధవారం మండల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మనువాదం మాయాజాలం నుంచి బీసీ యువకులు బయటికి రావాలన్నారు. బి.పి.మండల్ ఆశయ సాధనకు పోరాడాలన్నారు.. నాయకులు డాక్టర్ యూ.సోమశేఖర్, మల్లేశ్వరప్ప, నల్లారెడ్డి, శేషన్న పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కెఎండీ హనీఫ్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలను మార్చాలని, ఆశావర్కర్లు, ఆర్పీలను రాజీనామా చేయాలంటూ వేధిస్తున్నారన్నారు. ఇలాంటి రాజకీయ వేధింపులు వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం



షట్టర్ పైకెత్తి వదిలేసిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని కొత్త బస్టాండు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి పక్కన ఓబుక్ స్టాల్‌లో బుధవారం తెల్లవారుజామున చోరీ యత్నం జరిగింది. తెల్లవారుజామున దుండగులు బుక్‌స్టాల్ షట్టర్‌ను ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా కొంత వరకే షట్టర్ తెరుచుకుంది. అందులో దూరడానికి అడ్డంగా కొన్ని సామాన్లు ఉండడంతో దుండగులు లోపలికి వెళ్లలేకపోయారు. షట్టర్ తాళాలు పగలగొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. దుకాణంలో చోరీ ఏమీ జరగలేదని బుక్‌స్టాల్ యజమాని మహేష్ తెలిపారు. వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు వచ్చి షట్టర్ ఓపెన్ చేసి పరిశీలించారన్నారు.

అమరావతినగర్‌లో పందుల దొంగలు

పట్టణశివారులోని బసాపురం రోడ్డులో ఉన్న అమరావతినగర్‌లో బుధవారం తెల్లవారుజామున పందులను ఎత్తుకెళ్లేందుకు దొంగలు వచ్చారు. చప్పుడు వినపడడంతో కాలనీవాసి ఈరన్న లేచి కేకలు వేశారు. దీంతో వెంటనే పందుల దొంగలు ఆయనపై రాళ్లు, కర్రలతో దాడి చేసి పరారయ్యారు. చుట్టుపక్కల వారు రావడంతో దుండగులు పరుగులు తీశారు.

ఆర్టీసీ కండెక్టర్ మృతి



మృతిచెందిన కండక్టర్ సిద్ధయ్య

ఆదోని అర్బన్: ఆదోని ఆర్టీసీ డిపోలో కండెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కడప జిల్లా బద్వేల్ తాలూకా బొర్లపల్లె గ్రామానికి చెందిన సిద్ధయ్య(54) ఇందిరానగర్ కాలనీలోని తమ రూమ్‌లో మృతిచెందాడు. డిపో అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర తెలిపిన మేరకు వివరాలు.. మంగళవారం ఉరుకుంద పుణ్యక్షేత్రానికి బస్సు సర్వీసులో విధులు నిర్వహించి రాత్రి ఇందిరానగర్‌లోని రూమ్‌కు వెళ్లి పడుకున్నాడని చెప్పారు. ఉదయం తోటి కండెక్టర్ ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో రూమ్‌కి వెళ్లి చూడగా సిద్ధయ్య మృతిచెందినట్లు గుర్తించారు. విషయంపై సిద్ధయ్య కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. 2001లో ఆర్టీసీలో కండెక్టర్‌గా విధుల్లో చేరారని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయితే భార్య, పిల్లలు పోస్టుమార్టం వద్దు అని చెప్పడంతో సిద్ధయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.